అపూర్వ శిల్పం

ప్రభాకరదేవ్

ప్రొఫసర్ మాలవ్యా అర్జంటుగా రమ్మనమంటు ఫోన్ చేశాడు.

మూడు సంవత్సరాలయింది మాలవ్యాను నేను కలిసి. చాలా కలుపుగోరు మనిషి.

ఈ మధ్య డైమండ్స్ స్మగ్లింగ్ నిమిత్తం నేను సింగపూర్ వెళ్ళాల్సివచ్చింది. రాగానే మాలవ్యా నుండి పిలుపు.

మాలవ్యా ఏదో ముఖ్యమైన పని లేకుంటే పిలవడు. ఆ విషయం తనకు బాగా తెలుసు. భారత పురాతత్వ పరిశోధనా కేంద్రానికి ప్రొఫెసర్ మలవ్యా డైరెక్టరు. కాలాన్ని దుర్వినియోగం చెయ్యడానికి ఎంతమాత్రం ఇష్ట

పడని వ్యక్తుల్లో మాలవ్యా ఒకడు.

పాత ఢిల్లీలోని ప్రొఫెసర్ మాలవ్యా భవనం ముందు ప్లీమత్ ను ఆపాను. నాగురించి ఎదురు చూస్తున్నాడు శాబోలు. కారు ఆగిన శబ్దం వినగానే గబగబా పోర్టికో లోకి వచ్చాడు.

"గుడ్ మార్నింగ్" అన్నాడు విష్ చేస్తూ.

"వెరీ గుడ్ మార్నింగ్" చిర్నవ్వు నవ్వుతూ కారులో నుండి దిగాను.

ఇద్దరం కల్సి ప్రొఫెసర్ మాలవ్యా ప్రైవేట్ రూం లోకి వెళ్ళాం. మాలవ్యా మధ్యలో ఏమీ మాట్లాడలేదు. పైప్ ను గంభీరంగా పీలుస్తూ పొగవదుల్తున్నాడు.

రూంలోకి వెళ్ళిన తరువాత తన కుర్చీలో కూర్చుంటూ ఎదురుగావున్న కుర్చీలో కూర్చోమన్నట్లుగా సైగచేశాడు.

నేను కూర్చున్నాను. ఎయిర్ కండిషన్ రూం అది.

ప్రొఫెసర్ మాలవ్యా యింటర్ కమ్యూనికేషన్ స్విచ్ నొక్కి సెక్రటరీని రమ్మని పిలిచాడు.

నిమిషంలో వచ్చింది సెక్రెటరీ. పరిశీలనగా చూశాను. యిరవై రెండు సంవత్సరాలుంటాయి. అవయవాలన్నీ నిండుగా, పొందికగా, అమర్చినట్టున్నాయి. మగవాళ్ళను రెచ్చగొట్టే అందం. ఆంగ్లోయిండియన్. మాలవ్యా అభిరుచిని మనసులో అభినందించాను.

డ్రింక్స్ పంపించమని, మరెవర్నీ లోపలకు పంపించవద్దని చెప్పాడు మాలవ్యా. సెక్రటరీ తలాడించి, నావైపొకసారి చూసి వెళ్ళిపోయింది.

"ఫోనుచేసిన వెంటనే వచ్చినందుకు కృతజ్ఞతలు" అన్నాడు పైప్ లోని నుసిని యాష్ ట్రేలో దులుపుతూ.

"మీరు పిలిస్తే రావడండావుండగలనా? ఎనీన్యూస్??"
నవ్వుతూ అడిగాడు.

ప్రొఫెసర్ మాలవ్యా గంభీరంగా తలాడించాడు.

"చాలా ముఖ్యమైన పని. ఇంతవరకూ బహుశా నువ్వు యిటువంటి ఆపరేషన్ రిస్కు చేసివుండవు" అన్నాడు.

డొంక తిరుగుడు వ్యవహారాలు, మొగమాటాలు నాకు సరిపడవు. ఇబ్బందిగా ముఖం పెట్టి "అసలు విషయం చెప్పండి ప్రొఫెసర్!" అన్నాడు.

మాలవ్యా ఒక క్షణం నా భావాల్ని పసిగడుతున్నట్లుగా చూసి, చెప్పడం ప్రారంభించాడు:

"మిస్టర్ రామ్‌జీ! ఇటీవల మా పురాతత్వపరిశోధన శాఖవారికి కొన్ని తాళపత్రాలు దొరికాయి. అవి చాలా ప్రాచీనమైనవి. చారిత్రకంగా వాటి విలువ చాలా ఎక్కువ. అందులో కొన్ని తాళ ప్రతాలు 'చువాంగ్' అనే చైనీయ యాత్రికుని గ్రంధానికి సంబంధించినవి. తన యాత్రానుభవానులను, దర్శించిన స్థలాలను వివరంగా వ్రాసాడు. ఈ గ్రంథంలోని కొన్ని పేజీలు మాత్రమే మనకు లభ్యమయ్యాయి.

అందులో ఒకచోట అతడు మన దేశంలోని వింధ్య పర్వతాల మధ్యనున్న భయంకర అరణ్యాలగుండా ప్రయాణం చేసినట్లు వ్రాసాడు. అంతే కాదు, ఆ అరణ్యంలో ఒక ఆలయాన్ని చూసినట్లు, ఆ ఆలయంలోని మూల విగ్రహం భారతీయుల శిల్పకళా నైపుణ్యానికి చిహ్నంగా వున్నట్లుగా అభివర్ణించాడు."

చెప్పటం ఆపి, నేను శ్రద్ధగా వింటున్నానో లేదో అని పరిశీలనగా చూశాడు.

"ఎస్...ప్రొసీడ్" అన్నాను. మాలవ్యా ఒకసారి గొంతు సవరించుకుని తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

"మా డిపార్టుమెంటు వారి పరిశోధన ప్రకారం ఆ తాళపత్రగ్రంథం రెండువేల సంవత్సరాల క్రిందటిది. ఈ విషయాన్నిబట్టి ఆలోచిస్తే ఆ ఆలయంలో ఖచ్చితంగా రెండువేల సంవత్సరాల చరిత్ర కలదని మనం అంగీకరించాలి.

"అంతేకాదు, ఆ విగ్రహాన్ని 'చువాంగ్' తన గ్రంథంలో అపూర్వంగా వర్ణించాడు. 'చువాంగ్' మామూలు యాత్రికుడు కాదు. ప్రపంచంలోని చాలా భాగాన్ని పర్యటించి, ఆయా దేశాల సంస్కృతిని, కళలను బాగా పరిశీలించిన వ్యక్తి. అటువంటి వ్యక్తి ఆ విగ్రహాన్ని గొప్పగా వర్ణించాడంటే, ఆ విగ్రహానికి శిల్ప శాస్త్రరీత్యా ఎంత విలువ వుంటుందో ఆలోచించు."

నా ముఖంలోకి చూశాడు. నేను సిగరెట్‌ను గట్టిగా దమ్ములాగి, యాష్‌ట్రేలో పడవేశాను.

"అఫ్‌కోర్స్. మీరు చెప్పినదానినిబట్టి ఆ విగ్రహం అపురూపమైనదనే భావించాలి. ఇంతకీ ఆ విగ్రహం యిప్పుడు ఎక్కడుంది?" అడిగాను.

నా ప్రశ్నకు చిత్రంగా నవ్వేరు మాలవ్యా.

"బహుశా, ఆ అరణ్యాలలోనే ఇంకా వుండవచ్చును" అన్నారు నెమ్మదిగా.

"వాట్? విగ్రహం గురించి సమాచారం బైటపడినా మీ డిపార్టుమెంటు ఏమి చెయ్యకుండా కూర్చుందా?" విస్మయంగా అడిగాను.

"సమాచారం ఇంకా బైటపడలేదు రామ్‌జీ! ఈ తాళ

పత్రాలను పరిశీలించి, రిపోర్టు తయారుచెయ్యాల్సిన వ్యక్తిని నేనే. కనుక, ఈ విషయం యింకా వెల్లడి కాలేదు. వెల్లడయిన మరుక్షణంలోనే మా డిపార్టుమెంటు ఆ విగ్రహం గురించి ప్రయత్నాలు కొనసాగిస్తుంది."

గదిలో లైట్ వెలిగింది. ఇంటర్ కమ్యూనికేషన్ స్విచ్‌ను ఆన్ చేసి "యస్. కమిన్" అన్నారు.

ట్రేలో ఖాళీగ్లాసుల్ని, ఐస్ ఫ్లాస్కును, జానీవాకర్‌ను తీసుకువచ్చి టీపాయిమీద వుంచి వెళ్ళిపోయాడు బట్లర్.

మాలవ్యా బాటిల్ ఓపెన్ చేసి గ్లాసుల్లో సర్ది, ఐస్ ముక్కలు వేశాడు. ఒక గ్లాసును నాకు అందించాడు.

"ఫర్ ది జెస్ట్ ఆఫ్ బోత్" అంటూ ఛీర్స్ చెప్పి 'సిప్' చేశాడు ప్రొఫెసర్ మాలవ్యా.

నేను సగం తాగి సిగరెట్ వెలిగించాను.

"నాదో చిన్న అనుమానం ప్రొఫసర్!" అన్నాను మెల్లగా.

"ఏమిటది?"

"రెండువేల సంవత్సరాల క్రితం ఎవడో యాత్రికుడు వ్రాసిన దానినిబట్టి 'విగ్రహం' గురించి చెబుతున్నారు మీరు. ఇంకా, ఆ విగ్రహం ఆలయంలోనే వుంటుందని గ్యారంటీ ఏమిటి?" ప్రశ్నించాను.

"చాలా చక్కని అనుమానాన్ని వ్యక్తం చేశావు రామ్‌జీ! లాజికల్‌గా ఆలోచిస్తే నీ ప్రశ్న సరైనదే. కాని, కేవలం గ్రంథంలోని వ్రాతను ఆధారం చేసుకుని, యింకా ఆ విగ్రహం అక్కడే వుంటుందని నమ్మేటంతటి ఫూల్‌ను కాను. రెండువేల సంవత్సరాలంటే తక్కువ కాలమేం కాదు.

కాని, ఆ విగ్రహం యింకా అక్కడే వుంది. నాగరిక ప్రపంచానికి దూరంగా, భయంకర అడవుల్లో వుంది కనుకనే ఆ విగ్రహం యింకా స్థానభ్రంశం చెందలేదు. ఈ విషయాన్ని తెలుసుకోగలిగాను కనుకనే నిన్ను రమ్మని ఫోను చేశాను..." గంభీరంగా అన్నాడు మాలవ్యా.

విచిత్రంగా ప్రొఫెసర్‌ను చూశాను.

"ఆ విగ్రహం యింకా అక్కడే వుందని ఎలా తెలుసుకోగలిగారు?"

నా ప్రశ్నకు కొంతసేపు మౌనం వహించారు మాలవ్యా. ఏదో విషయాన్ని చెప్పడానికి సంశయిస్తున్నట్లున్నాడు.

నేను విస్కీ గ్లాసును పూర్తి చేశాను.

"మజ్‌ధూర్ పేరు వినేవుంటావు కదూ?!"

మామధ్య అంతవరకూ ఏర్పడిన నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అడిగారు మాలవ్యా.

'మజ్‌ధూర్' పేరు వింటూనే వులిక్కిపడ్డాను. ప్రముఖ విప్లవకారుడు మజ్‌ధూర్! ప్రభుత్వాన్ని పతనం చెయ్యడానికి అనేక ఘోరకృత్యాలు గావించాడు. అతనిని పట్టుకున్నవారికి లేదా చంపినవారికి లక్షరూపాయలను బహుమతిగా ప్రభుత్వం ఎన్నడో ప్రకటించింది. అయినా, అతను యింతవరకూ తప్పించుకు తిరుగుతున్నాడు.

మాలవ్యా ప్రశ్నకు తెలుసునన్నట్లుగా తలాడించాను.

"మజ్‌ధూర్ నాకు చిన్ననాటి స్నేహితుడు. పెద్దవాళ్ళమయ్యాక మా దారులు వేరయ్యాయి. కాని, మా స్నేహం చెడలేదు. ప్రభుత్వందృష్టిలో అతడు శిక్షార్హుడు. అతడ్ని పట్టించినవారికి, లేదా చంపినవారికి బహుమతిని

ప్రకటించింది ప్రభుత్వం. అతడ్ని అరెస్టు చెయ్యడానికి ఎన్నో వలలు పన్నింది.

పరిస్థితులు ప్రమాదకరంగా తయారవటం గమనించి వింధ్యారణ్యాలకుపోయి తల దాచుకున్నాడు మజ్‌ఘూర్.

గతసంవత్సరం వింధ్యపర్వతాలకు దగ్గరలో నున్న నర్మదానదీ ప్రాంతాలలో మా డిపార్ట్‌మెంట్ పరిశోధనలు ప్రారంభించింది. నెలరోజులకు పైగా త్రవ్వకాలు జరిగాయి.

ఆ రోజుల్లో 'మజ్‌ఘూర్' నన్ను నర్మదానదీతీర ప్రాంతంలో కల్సుకున్నాడు. మనిషి అనారోగ్యంవలన బాగా కృషించి వున్నాడు. వింధ్యారణ్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు చెప్పాడు. ఎంతయినా, బాల్యస్నేహితుడు. రెండురోజులు ఆతిథ్యం ఇచ్చి నా గుడారంలోనే వుంచుకున్నాను.

ఒకరోజు, మాటల సందర్భాన వింధ్యారణ్యంలో ఒక చోట ఆలయాన్ని చూశానని, అందులో విగ్రహం అత్యంత సౌందర్యవంతమైనదని చెప్పాడు. ఆ సమయంలో ఈ విషయానికి అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ తాళపత్రాలలో విషయాన్ని చదివేసరికి మజ్‌ఘూర్ చెప్పింది కూడా గుర్తుకు వచ్చింది. తాళపత్రాలలో 'చువాంగ్' వర్ణించిన ఆలయానికి, మజ్‌ఘూర్ చెప్పిందానికి వ్యత్యాసం లేదు. దీన్నిబట్టి, ఆ విగ్రహం యింకా అక్కడే వుంటుందన్న అభిప్రాయానికి వచ్చాను."

చెప్పటం ముగించాడు మాలవ్యా. తన గ్లాసులో యింకా మిగిలివున్న విస్కీని ఖాళీచేశాడు.

"ఆ విగ్రహం ఎంత విలువ చేస్తుందో తెల్సా?" నా

ఆలోచనలకు అంతరాయం కల్పిస్తూ అడిగాడు మాలవ్యా.

నేను తల అడ్డంగా ఆడించాను.

"ఒక విదేశీయుడినుంచి నల భైలక్షలకు ఆఫరుంది."

"మైగాడ్!" ఆశ్చర్యపోయాను. పెద్ద బేరమే తగులుతుందని భావించాను కాని మరీ యింత పెద్ద ఆఫరు వస్తుందని అనుకోలేదు.

"నన్ను యిప్పుడేం చెయ్యమంటారు ప్రొఫెసర్?" సాలోచనగా మాలవ్యాను చూస్తూ ప్రశ్నించాను.

"నువ్వు ఆ విగ్రహాన్ని సంపాదించాలి" గంభీరంగా అన్నాడు.

నేను తలాడించాను. నల భైలక్షలగురించి ఎటువంటి రిస్కునయినా తీసుకోవచ్చును.

"ఆలయాన్ని గుర్తించడానికి 'మజ్ ధూర్' సహాయం తీసుకుంటే మంచిదనుకుంటాను" అన్నాను.

నా సూచనకు భారంగా నిట్టూర్చాడు మాలవ్యా. రిమ్ లెస్ కళ్ళద్దాలను ఎడంచేత్తో తీసి కర్చీఫ్‌తో తుడిచాడు.

"నువ్వు చెప్పింది బాగానే వుంది రామ్‌జీ. కాని మజ్ ధూర్ మనకు అందుబాటులో లేడు. అసలు, అతను యింకా జీవించి వుంటాడనుకోను. నన్ను కలుసుకున్నప్పటికే అతని ఆరోగ్యం బాగా దెబ్బతిని వుంది. మనిషి యింకా ఎక్కువరోజులు బ్రతకడనిపించింది. యాదృచ్ఛికంగా ఆ రోజు కలిశాడు. ఇప్పుడు తన సహకారం గురించి ఆశించడంలో అర్థంలేదు. నువ్వే ఆ ఆలయాన్ని కనుగొని విగ్రహాన్ని సంపాదించాలి."

నేను మరేం ఆలోచించలేదు. వెంటనే తలాడించాను.

"సంపాదిస్తాను. టర్మ్స్ ఏమిటి?" ముందుగానే అన్ని విషయాలు మాట్లాడుకుంటే మంచిదన్న అభిప్రాయంతో అడిగాను.

"ఫిఫ్టీ...ఫిఫ్టీ..." అన్నాడు ప్రొఫెసర్.

సరే అన్నట్లుగా తల పంకించాను.

"మిస్టర్ రామ్‌జీ! ముఖ్య విషయం చెప్పడం మరిచాను. చాముండేశ్వరిదేవి వింధ్యారణ్య ప్రాంతాల ఆటవికులకు కులదేవత. ఆటవికులు ఎంత ప్రమాదస్తులో అంత సాత్వికులని మజ్‌ధూర్ చెప్పాడు. జాగ్రత్తగా వ్యవహరించాలి" హెచ్చరించాడు ప్రొఫెసర్.

నొసలు చిట్లించాను.

దొంగలతోను, పోలీసులతోను, కస్టమ్స్‌వాళ్ళతోను అనేక సమయాల్లో రిస్క్ తీసుకున్నాను.

కాని, ఆటవికులతో యింతవరకూ లేదు. ఇదొక, కొత్త అడ్వెంచర్.

ఖాళీగ్లాసులోకి కొంత విస్కీని వొంపుకుని ఐస్ ముక్కలు వేసుకున్నాను. నిమిషంలో ఖాళీ చేశాను.

బుర్ర చురుగ్గా పనిచేస్తుంది. నా ఆలోచనలన్నీ విగ్రహం గురించి. ఆటవికులతో వ్యవహారం కాబట్టి, కొత్త రకం పద్ధతులు అవలంభించాలి. నావల్టీ ఆపరేషన్!

"వింధ్యారణ్యాలు విస్తీర్ణమైనవి. అందులో ఆలయాన్ని కనుగోవడం చాలా కష్టం. నర్మదానదీ ప్రాంతంలో మేం త్రవ్వకాలు జరిగినప్పుడు అక్కడున్న 'భావనగర్' గ్రామంలో 'సులేఖాన్' అనే అతను నాకు స్నేహితుడయ్యాడు. అతను వింధ్యారణ్యాలలో జంతువులను పట్టుకుని వాట్ని అమ్ముకొని జీవిస్తుంటాడు. చాలా పెద్ద

వ్యాపారం సులేఖాన్‌ది. అతని సహాయం నీకు వింధ్యా రణ్యాలలో కొంత ఉపయోగించవచ్చు.

నా మిత్రుడువిగా నిన్ను సులేఖాన్‌కి పరిచయం చేసుకో. నేను పంపించినట్లుగా చెప్పు. ఇంతవరకే ఈ ఆపరేషన్‌లో నేను నీకు సహాయం చేయగలను. ఎలా విగ్రహాన్ని సంపాదిస్తావో...ప్లానంతా నువ్వే ఆలోచించాలి'' అన్నాడు మాలవ్యా.

ఆ విషయం నాకు చెప్పక్కర్లేదు. నా మార్గాలు నాకు వుంటాయి.

నేను కుర్చీలోనుండి లేచాను. ప్రొఫెసర్ కూడా లేచాడు. ఐరన్ సేఫ్ తెరిచి ఒక జిప్ బ్యాగ్ తీసి నాకు యిచ్చాడు.

''ఇందులో లక్షరూపాయలున్నాయి. అడ్వాన్సుగా రెండులక్షలు యిచ్చారు. అందులో మన అగ్రిమెంట్ ప్రకారం సగం యిస్తున్నాను'' అన్నాడు.

బేగ్‌ను నిర్లక్ష్యంగా అందుకున్నాను.

''థాంక్స్ ప్రొఫెసర్! మీకు మరల నేను విగ్రహంతోనే కనిపిస్తాను'' అన్నాను.

''వన్ మినిట్ ప్లీజ్! ఈ మినియేచర్ వైర్‌లెస్ సెట్‌ను నీదగ్గరవుంచు. ప్రతిరోజు దీనిద్వారా నీప్రోగ్రస్‌ను తెలియపరచాలి'' అన్నాడు.

నేను చిన్నగా నవ్వి, సెట్‌ను తీసుకొన్నాను.

2

సాయంకాలం అయిదున్నరయింది.

చలికాలం కావటంవలన త్వరగా చీకటి రేఖలు వ్యాపిస్తున్నాను. ఢిల్లీలో చలి విపరీతం.

నేనూ, అజాద్ లాంగ్ కోట్స్ వేసుకున్నాం. అజాద్ నాకు అసిస్టెంట్ లాంటి వాడు.

అజాద్ ఆచార్యా అనే శిల్పాచార్యుడ్ని తీసుకు వచ్చాడు. మనిషి సన్నగా, రివటలాగున్నాడు.

కల్లీ లాల్చీ తొడుక్కుని, దానిమీద నెహ్రూ కైప్ ఉన్నికోటును వేసుకున్నాడు.

అజాద్ నా సూచనమేరకు హిప్పీలాగ స్టెయిల్ను మార్చేడు. నేనూ కూడా అదేమాదిరిగా తయారయ్యాను మెడలో రుద్రాక్షమాలలు.

ప్రయాణానికి కావల్సిన సరంజామంతా సిద్ధంచేశాను. వాటిని కారులో పెడుతున్నారు ఆచార్య, అజాద్లు.

సామాను సర్దటం పూర్తయింది.

అజాద్, ఆచార్యలు కారు వెనుకసీటులో కూర్చు న్నారు. డ్రయివింగ్ సీట్లో కూర్చుని, కారును స్టార్ట్ చేశాను.

అరగంటలో మా ఫియట్ కారు ఢిల్లీనగరాన్ని దాటి, 'ఇండోర్' వెళ్ళే రోడ్డుమీద రయ్మంటూ దూసుకు పోసాగింది.

మధ్యలో రెస్టుకు ఎక్కడా కారును ఆపదల్చుకో లేదు. రాత్రి భోజనాలను ఆగ్రాలో పూర్తిచేసుకుని రాత్రంతా కారులో ప్రయాణించాం. అజాద్ ఆగ్రాలో స్టీరింగ్ను తీసుకొన్నాడు.

డ్రయివింగ్లో అజాద్ నాకన్నా మంచి ఎక్స్పర్ట్. ఎనభైమైళ్ళ వేగంతో కారును పోనిస్తున్నాడు.

చల్లని గాలికి శరీరం వణుకుతుంది.

కారు విండోడోర్స్ బిగించాను.

విగ్రహాంగురించి వేసుకున్న ప్లానులో ఏమైనా లోటు

పాట్లు వున్నాయేమోనని ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాను.

ఆలోచనల్లోనే నిద్రపట్టేసింది.

తెలివి వచ్చేసరికల్లా తూర్పుదిక్కున చీకట్లు చెదురుతున్నాయి. సూర్యోదయానికి చిహ్నంగా వాతావరణం ఆహ్లాదకరంగావుంది. సిగరెట్ పొగవదుల్తూ సీరియస్‌గా కారు నడుపుతున్నాడు అజాద్. ఆరున్నరకల్లా 'ఝాన్సీ' చేరుకున్నాం.

"వండ్రఫుల్ డ్రయివింగ్" అన్నట్లుగా అజాద్ భుజాన్ని ఆప్యాయంగా తట్టేను.

'ఝాన్సీ'లోని కాంటినెంటల్ కాటేజీకి వెళ్ళాం. డబుల్ ఎసి రూం బుక్ చేశాడు అజాద్.

పదిగంటలకల్లా కాలకృత్యాలు ముగించి, టిఫిన్ చేసి, తిరిగి ప్రయాణానికి రెడీ అయ్యాం.

"అజాద్! నువ్వు పడుకో నేను డ్రయివ్ చేస్తాను" అన్నాను.

మా ప్రయాణం మొదలయింది. భూపాల్ మీదుగా 'యిండోర్' చేరుకోవాలని నా ఉద్దేశ్యం.

రెండురోజుల్లో, అంటే రేపటి సాయంకాలానికల్లా యిండోర్ చేరుకోవాలి.

నా దృష్టినంతా డ్రయివింగ్ మీద నిమగ్నం చేసాను.

3

మా ప్రయాణం అనుకున్నట్లుగానే సాగింది.

కారు 'ఇండోర్'లో ఆగినప్పుడు 'ఆచార్య' ప్లాస్టరాఫ్ పారీస్ పౌడరు డబ్బా పెద్దది కొన్నాడు.

'భావనగర్'ను ఎటువంటి ఆటంకాలు లేకుండా చేరుకున్నాం.

ప్రొఫెసర్ మాలవ్యా స్నేహితుడు 'సులేఖాన్'ను కలుసుకోవడం ఏమంత కష్టం కాలేదు.

మనిషి భారీగా, భయంకరంగా వున్నాడు. మెడలో బంగారు గొలుసుకి పులిగోరు పతకం వుంది. చేతినిండా ఉంగరాలు.

'సులేఖాన్'కు నమస్కరించి, ప్రొఫెసర్ మాలవ్యా పంపించినట్లుగా చెప్పాం. మాలవ్యా పేరు వినగానే మాకు అతిథి మర్యాదలు చక్కగా జరిపించాడు సులేఖాన్. మేం వచ్చిన పని గురించి అడిగాడు. నేను గొంతు సవరించుకున్నాను.

"ఈ వింధ్యారణ్య ప్రాంతంలో చాముండేశ్వరిదేవి ఆలయంవుంది. ఆదేవిని సందర్శించి ధన్యులమవుదామని మా కోరిక. ఆ ఆలయానికి మార్గం మీకు తెలిసివుండవచ్చునని మాలవ్యా చెప్పారు" అన్నాను, సాధ్యమైనంతవరకూ గొంతులో భక్తిని ధ్వనింపచేస్తూ.

నా మాటలకు సులేఖాన్ భృకుటి ముడిపడింది. తీక్షణంగా నావైపు చూశాడు. ఆ చూపులో భావాన్ని పసికట్టడానికి నాకు శక్తి చాలింది కాదు.

"ఆ ఆలయం ఎంత మాత్రం ప్రసిద్ధి చెందినది కాదు' దాని వునికి గురించి నాగరిక ప్రపంచానికి ఎంత మాత్రం తెలియదని చెప్పవచ్చును. అటువంటి ఆలయాన్ని వెదుక్కుంటూ మీరు రావడం ఆశ్చర్యంగా వుంది," అన్నాడు చేతికున్న వ్రేలి వుంగరాలను సవరించుకుంటూ.

మేం మాటాడలేదు.

"ఇంతకీ ఆ ఆలయం వింధ్యారణ్యాలలో వున్నట్లు ఎలా తెలిసింది?" అనుమానంగా చూస్తూ ప్రశ్నించాడు'

ధైర్యాన్ని, యుక్తిని ప్రదర్శించకపోతే సులేఖాన్ చేతిలో దెబ్బ తినాల్సి వుంటుందనుకున్నాను.

"ఇతను నా స్నేహితుడు. గొప్ప దేవీ భక్తుడు. చాముండేశ్వరిని ఉపాసిస్తున్నాడు. కలలో కనబడి తాను వింధ్యారణ్యాలలో వున్నట్లుగా, తనను అక్కడ దర్శించవచ్చునని సెలవిచ్చింది," అన్నాను అజాద్‌ను చూపించి.

ఇది నిజమేనా అన్నట్లుగా చూసి, గంభీరంగా తలాడించాడు.

"ఈ రాత్రికి మీరు విశ్రాంతి తీసుకోండి. రేపు వుదయాన్నే బయల్దేరి వెళ్లురుగాని. మీకు తోడుగా మా మనిషిని పంపిస్తాను. వారంరోజులు అరణ్యంలో కాలినడకన ప్రయాణిస్తేగాని, మీరు ఆ ఆలయాన్ని చేరుకోలేరు" అన్నాడు.

'హమ్మయ్య!' అనుకుని, నిట్టూర్చాను. ఇంతవరకూ అంతా సవ్యంగానే జరిగింది.

ఆ రాత్రికి మాకు విందు ఏర్పాటుచేశాడు సులేఖాన్. అడవిపంది మాంసం మా గురించి ప్రత్యేకంగా వండించాడు. రుచిగా వుంది. ద్రాక్షసారాయిని పీకలదాకా ఎక్కించాం. సులేఖాన్ మేం ఆశ్చర్యం చెందేలాగ చిత్తుగా తాగేడు. నేను 'జానీవాకర్'ను బహూకరిస్తే, గోల్డ్‌స్పాట్ తాగినట్లుగా గడగడ త్రాగేడు.

విందులో మాటల సందర్భంలో ఆటవిక నాయకుడు తనకు స్నేహితుడని చెప్పాడు సులేఖాన్. క్రూరమృగం బారినుండి నాయకుడ్ని ఒకసారి సులేఖాన్ రక్షించాడట. తాగిన మైకంలో జంతువులను పట్టడానికి అడవిలో ఎటువంటి సాహసాలను చేసింది చెప్పాడు.

మేం అనుకున్నట్లుగా సులేఖాన్ చిన్న జంతువుల వ్యాపారస్తుడు కాదు. పులులను, ఎలుగుబంట్లను యింకా యితర క్రూరమృగాలను పట్టుకుని విదేశాలకూ్కడా ఎగుమతి చేస్తుంటాడు సులేఖాన్. అతని పరిచయం లభించినందుకు చాలా ఆనందించాను.

విందు ముగిసిన తరువాత సులేఖాన్‌కు "గుడ్ నైట్" చెప్పి, మాకు కేటాయించిన గదికి వెళ్ళిపోయాం.

ద్రాక్షసారా ప్రభావం కాబోలు, మత్తుగా నిద్ర పట్టింది నాకు.

4

సూర్యుని కిరణాలు చురుక్కుమనిపించటంతో కళ్ళు తెరిచాను. టైం చూశాను. ఏడుగంటలయింది.

అజాద్, ఆచార్య, యింకా నిద్రపోతున్నారు. తట్టి లేపాను. ముగ్గురం కాలకృత్యాలు గబగబా ముగించుకున్నాం.

ఉదయం ప్రయాణం అని చెప్పాడు సులేఖాన్. ఇంకా రాలేదు.

సులేఖాన్ గది మా గదికి కొద్ది దూరంలోనే వుంది. సులేఖాన్‌ను కల్సుకు వస్తానని నా అనుచరులిద్దరికి చెప్పి బయలుదేరాను.

సులేఖాన్ యింకా నిద్రపోతున్నాడు. రాత్రి తాగిన మందు ప్రభావం యింకా తగ్గలేదు కాబోలనుకున్నాను.

నా రాకను పసికట్టి పులిపిల్ల గుర్రుమంది. ఉలిక్కిపడ్డాను. అంతవరకూ నేను గమనించలేదు. సులేఖాన్ పక్కలోనే పడుకుంది పులిపిల్ల. వెనక్కు రెండడుగులు వేశాను.

పులిపిల్ల గుర్రుపెట్టడం విని, బద్దకంగా కళ్ళు తెరిచి నన్ను చూశాడు. కర్తవ్యం గుర్తుకు వచ్చినవాడిలా గబుక్కున లేచి కూర్చున్నాడు.

"సారీ. మీ ప్రయాణానికి ఆలస్యం జరిగింది" అన్నాడు నొచ్చుకున్నట్లుగా.

ఫరవాలేదన్నట్లుగా నేను నవ్వేను. పులిపిల్ల ఆప్యాయంగా యజమాని కాళ్ళను నాకుతూంది.

"క్రూరమృగాన్ని పక్కలో పెట్టుకుని పడుకున్నారు. ప్రమాదంకదా?" అడిగాను.

నా ప్రశ్నకు విచిత్రంగా నవ్వేడు సులేఖాన్. ప్రేమగా పులిపిల్లి వీపు నిమిరాడు.

"మనిషికన్నా ఎన్నోరెట్లు ఈ జంతువు నయం. ఎదుటివాడికి ఇవి హాని కలిగించాలనుకుంటే, ముందుగా హెచ్చరిస్తున్నట్లుగా గర్జించి పంజా విసురుతాయి. కాని మనుషులలా కాదు. భుజంమీద చెయ్యివేసి కబుర్లు చెబుతూనే వెన్నుపోటు పొడుస్తారు. మనిషిని నమ్మి నిద్రపోవడం కన్నా జంతువును నమ్మటం మంచిది."

సులేఖాన్ మాటలకు అంగీకార సూచనగా తలాడించాను.

"వెల్. మీరు ప్రయాణానికి సిద్ధంగా వున్నట్లుంది. మా అనుచరుడ్ని పిలుస్తాను" అంటూ కేక వేశాడు.

ముప్ఫయి సంవత్సరాల వ్యక్తి గబగబా వచ్చేడు.

"వింధ్యారణ్యంలో ఆలయానికి నువ్వు వీరిని తీసుకువెళ్లాలి. అక్కడి నాయకుడితో వీరిని నేను పంపించినట్లుగా చెప్పు" అంటూ సూచనలిచ్చాడు.

అలాగే నన్నట్లుగా తలాడించాడు ఆ వ్యక్తి. అతడి

పేరు వీరడని తెలియచేశాడు సులేఖాన్.

నేను సులేఖాన్ దగ్గర సెలవు తీసుకుంటుంటే, ఒక హెచ్చరిక చేశాడు.

"మీరు చాముండేశ్వరిదేవి దర్శనానికిగాను వెళ్తున్నట్లు చెప్పారు. నేను కూడా ఆ దేవి భక్తుడ్నే. చాలా మహిమగల తల్లి. మాలవ్యా నాకు మిత్రుడు. అందుచేత మీకు సహాయం చేస్తున్నాను. అక్కడి ఆటవిక నాయకుడు నాకు మిత్రుడే కావచ్చు. కాని వారు కఠిన నియమాలను పాటిస్తారు. మీరుకూడా పాటించాలి. లేకపోతే, ప్రాణం తియ్యడానికి కూడా వెనుదియ్యరు. ఏది ఏమైనా మీరు సదుద్దేశ్యంతోనే ఆలయానికి వెళ్తున్నారని భావిస్తున్నాను. నా అంచనా తప్పు అయితే ఫలితాన్ని మీరే అనుభవిస్తారు."

సులేఖాన్ చెప్పిందంతా జాగ్రత్తగా విని, సెలవు తీసుకున్నాను.

5

వింధ్యారణ్యాలు!

వాటిలో చాలా భయంకరమైన అరణ్యభాగం అది. వీరడు ముందు దారి తీస్తున్నాడు.

నేను, అజాద్, ఆచార్య అతని వెనకనే సాగిపోతున్నాం.

మా ప్రయాణానికది తుదిరోజు.

సాయంకాలానికల్లా ఆలయ ప్రాంతాలలో నున్న ఆటవికుల గూడెంకు చేరుకుంటామని చెప్పాడు వీరడు.

అందరి ముఖాలలోను గమ్యాన్ని చేరుకుంటున్నామన్న ఆనందం తాండవిస్తుంది. అంతవరకు పడిన శ్రమను మరిచి

పోయి, వుత్సాహంగా వున్నారు.

వీరడు మధ్యాహ్నం ఓ కుందేలును వేటాడి, మాంసాన్ని కాల్చి యిచ్చాడు. పెప్పర్ జల్లుకుని తిన్నాం. టేస్ట్ ఫుల్ గా వుంది.

మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో సమతల ప్రదేశానికి అంతా చేరుకొన్నాం. మేమున్న ప్రదేశంలో చెట్లు గుబురుగా లేవు. కనుచూపు దూరంలో అక్కడక్కడా చిన్న చిన్న గుడిసెలు కనిపిస్తున్నాయి. గూడెంను సమీపించినట్లుగా చెప్పాడు వీరడు.

అరగంటలో అందరం అక్కడకు చేరుకున్నాం.

ఆటవికుల్లో చాలామంది మమ్మల్ని చూడగానే వింతగా అరుస్తూ చుట్టుముట్టేరు.

అందరి చేతుల్లోను విల్లంబులూ, ఈటెలూ వున్నాయి.

వీరడు వాళ్ళ భాషలో ఏదో చెప్పాడు.

మాకు ఆ భాష అర్థం కాలేదు.

"పదండి, నాయకుడి దగ్గరకు వెళ్దాం" అన్నాడు వీరడు.

కొందరు ఆటవికులు దారి చూపగా, నాయకుడు వున్న గుడిసె దగ్గరకు వెళ్ళాం.

వెదురు బొంగులతో నిర్మించిన గుడిసె అది. అందంగా, శుభ్రంగా వుంది.

వాళ్ళ భాషలో మమ్మల్ని నాయకుడికి పరిచయం గావించాడు. మేం నమస్కరించాం.

చూడ్డానికి పెద్ద భయంకరంగా నాయకుడు లేడు. పొట్టిగా, లావుగా వున్నాడు.

మొలకు పులిచర్మం చుట్టుకున్నాడు.

పక్కలో, కొమ్ము ఒరలో బాకు వుంది.

మేం సులేఖాన్ పంపిన మనుష్యులమని తెలియడం వలన మాకు చిక్కటి పాలు, అరటిపండ్లు తెప్పించి యిచ్చాడు.

వాళ్ళభాషలో మమ్మల్ని ఏదో అడిగాడు.

మాకు అర్థంకాలేదు. వీరడి ముఖంలోకి చూశాను.

"మీరు ఎందుకు వచ్చారో, కారణం అడుగుతున్నారు" విశదీకరించాడు వీరడు.

చాముండేశ్వరిదేవి దర్శనానికి వచ్చినట్లుగా చెప్పాం. అంతేకాకుండా, ఆదేవి తమ కలలో కనిపించినట్లు, యిక్కడకు వెళ్ళమన్నట్లుగా అబద్ధం చెప్పాం.

మా మాటల్ని వాళ్ళభాషల్లోకి తర్జుమా చేసి చెప్పాడు వీరడు.

ఆటవికుల నాయకుడు సంతృప్తిగా తలాడించి, ఆకాశం లోకి భక్తిగా చూసి నమస్కరించాడు.

కొందరు ఆటవికుల్ని పురమాయించి మాకు వసతి సదుపాయాలు ఏర్పరచి, వీరడితో కొంతసేపు ముచ్చటించి వెళ్ళిపోయాడు నాయకుడు.

అతనేం మాట్లాడేడో వీరడ్ని అడిగాం.

"ఆలయం రెండుమైళ్ళ దూరంలోవుంది. రాత్రి అయింది కనుక రేపు వెళ్ళవచ్చు. ఈరాత్రికి తిని, పడుకోండి" అని చెప్పాడట నాయకుడు.

లేడిమాంసం, అడవిలో దొరికేపళ్ళు, తేనె పంపించారు.

కడుపునిండా తిని, తేనె తాగేం.

ఆరాత్రి చాలాసేపు ఆటవికుల భాషగురించి చెప్పాడు వీరడు. కొన్ని మాటలకు అర్థాలు తెలిసాయి.

6

మర్నాడుదయాన్నే అందరం కలసి ఆలయానికి బయలు దేరాం. నాయకుడుకూడా త్రిశూలంలాంటి ఆయుధాన్ని పట్టుకుని మా వెంట వచ్చాడు.

ముప్పావుగంట ప్రయాణించి ఆలయాన్ని చేరుకున్నాం.

ప్రాచీనమైన ఆలయమని చూడగానే తెలుస్తుంది.

చిన్న కొండను దొలిచి ఆలయంగా నిర్మించారు. ఆ ఆలయానికి చుట్టుప్రక్కల నాలుగయిదు తాటాకుపాకలు వున్నాయి.

ఆలయంలోకి అడుగుపెట్టాం. లోపల మాంత్రికుడి లాగున్న వ్యక్తి మమ్ములను చూస్తునే లేచినిలబడి, నాయకుడిని ఆశీర్వదిస్తున్నట్లుగా చెయ్యెత్తాడు. మొలకు ఎలుగుబంటి తోలు చుట్టివుంది. జడలు కట్టిన జుత్తును సిగ చుట్టి ముడివేసుకున్నాడు. కళ్ళు ఎర్రగావున్నాయి. నుదిటికి రూపాయంత ఎర్రని బొట్టువుంది. మెడలో రుద్రాక్ష మాలలు.

మేంవచ్చిన పనిగురించి నాయకుడు పూజారికి చెప్పాడు. పూజారి పేరు గణాచారి. ఇప్పుడు వాళ్ళభాష కాస్త అర్థమవుతుంది నాకు. రాత్రంతా చాలా పదాలకు అర్థాలు తెలుసుకున్నాను వీరడివలన. వాళ్ళభాష చాలా సులభమైందిగా తోచింది.

గర్భగుడిలోకి వెళ్ళాం.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను.

పులికొవ్వు నూనె దీపం వెలుగులో చాముండేశ్వరిదేవి దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది.

ఆ సౌందర్యానికి ముగ్ధుడినయ్యాను.

అజాద్ ఆ విగ్రహంవంక కళ్ళప్పగించి చూస్తున్నాడు. ఆచార్య సరేసరి.

మేం దేవి ఉపాసులమని చెప్పాడు వీరడు.

దేవిని దర్శించిన తరువాత అందరం బైటకువచ్చాం.

తిరిగి గూడేంను చేరుకుంటే నా ప్లాను దెబ్బతింటుంది. ఆలోచించాను. పరిసరాలను జాగ్రత్తగా పరిశీలించాను.

"నాయకా! మీరు అనుమతిస్తే మేం యిక్కడే వుండి దేవిని వుపాసిస్తాం" అన్నాను పదాలను తడుముకుంటూ.

ఇంత త్వరగా వాళ్ళ భాషలో మాట్లాడినందులకు ఆశ్చర్యపోయాడు నాయకుడు. అంతా ఆ దేవి చలువ అన్నాను.

నా పట్టుదల సంగతి అతడికేం తెలుసు?

నా మాటలకు అంగీకరించి, మా వసతికి, పూజలకు అన్ని ఏర్పాట్లు చెయ్యమని గణాచారితో చెప్పాడు. మేం వెళ్ళిపోతున్నప్పుడు తనను కల్సుకోవల్సిందిగా కోరాడు.

గణాచారి తనవెంట ఒక గుడిసెలోకి తీసుకువెళ్ళి, అందులో మేం వుండవచ్చని చెప్పాడు. ఆ గుడిసె మా నలుగురికి చాలదు. ఆ విషయాన్ని చెబితే, చాలకపోతే ఆలయం ముంగిట చెట్టుక్రింద పడుకోమన్నాడు. చేసేది లేక తలాడించాను నేను.

7

మధ్యాహ్నం భోజనాలయ్యాక వేపచెట్టుక్రింద కళ్ళు మూసుకుని, పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు గణాచారి. నేను మెల్లగా అతని దగ్గరచేరి, కూర్చుని నమస్కరిస్తూ—

"స్వామీ!" అని మెల్లగా పిల్చాను.

కళ్ళు తెరిచి నావైపు చూశాడు.

"దేవీదర్శన భాగ్యం లభించినందుకు మాజన్మ ధన్య మైంది స్వామి!" అన్నాను భక్తి నటిస్తూ.

"అవునురా. ఆ దేవి దర్శనం దుర్లభం. మీరు యిన్నా ళ్ళకు సాధించారు. నేను అయిదువేల సంవత్సరాలనుండి ఈ చాముండేశ్వరి దేవాలయ పూజారిని. ఈ తల్లిని దర్శిం చిన యితరులు చాలా తక్కువ బహుతక్కువ" అన్నాడు తన నల్లని గడ్డాన్ని సవరించుకుంటూ.

గణాచారి మాటలకు విస్తుపోయాను.

అయిదువేల సంవత్సరాలనుండి గణాచారి ఈ ఆల యానికి పూజారా? నమ్మశక్యంగా తోచలేదు. గణాచారిని వాచాలుడిగా తలచాను.

"ఏమిట్రా మూర్ఖా! ఆలోచిస్తున్నావు. అయిదువేల సంవత్సరాల పూజారత్వమంటే జన్మజన్మలనుంచి అని అర్థంరా" చిద్విలాసంగా నవ్వుతూ అన్నాడు.

"పద. దేవికి సంధ్యార్చనగావిద్దాం" అన్నాడు.

నేను బయలుదేరాను పూజారి వెనకాలే.

చాముండేశ్వరి విగ్రహంముందు కూర్చుని, కళ్ళుమూసు కుని మంత్రాలు చదవసాగేడు గణాచారి.

నేను విగ్రహాన్ని చూస్తూ నిలుచున్నాను.

కాలం దొర్లిపోతుంది.

మంత్రాలను గణాచారి వేగంగా చదువుతున్నాడు.

కళ్ళుమూసుకుని పూనకం వచ్చినవాడిలా వూగు తున్నాడు.

స్వరం రానురాను ఎక్కువవుతోంది.

గణాచారి వాలకాన్ని చూస్తుంటే చాముండేశ్వరి

దేవికి నిజమైన భక్తుడే అనిపించింది. చుట్టుపక్కల ఏం జరుగుతుందో పట్టించుకునే స్థితిలో లేడు.

నేను పేంటు జేబులోనుండి మినియేచర్ ఫ్లాష్ కెమెరా తీసి, వివిధ కోణాల్లో గబగబా ఫోటోలు తీశాను.

గణాచారి మంత్రాలు చదవడం ముగించడ మింకా పూర్తికాలేదు. కెమెరాను తిరిగి జేబులో పడేసి గణాచారి దగ్గరగా కూర్చున్నాను.

చేతులు జోడించి, కళ్ళు మూసుకున్నాను.

కొంతసేపటికి గణాచారి మంత్రాలు చదవడం పూర్తి చేసి, నా భుజం తట్టి పిల్చాడు.

నేను భక్తిపారవశ్యంలోనుండి తేరుకున్నవాడిలా చూశాను. నన్ను ప్రేమగా వీపు తట్టేడు.

"సంధ్యవేళ దేవిదర్శనం చాలామంచిది. మీ వాళ్ళను పిల్చుకు రా" అన్నాడు.

నేను గుడిసెలో కెళ్ళేను.

ఆచార్య, వీరడు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"అజాద్ ఎక్కడ?" అడిగాను.

గణాచారి గుడిసెవైపు చేయి చూపించాడు ఆచార్య. అటువైపు నడిచేను. నన్ను అనుసరించారు యిద్దరూ.

అజాద్ లోపల యిరవైసంవత్సరాల అమ్మాయితో మాట్లాడుచున్నాడు. అతనికికూడా ఆటవికుల భాష కాస్తంత వచ్చింది. అజాద్ మాటలకు ఆ అమ్మాయి విరగబడి నవ్వుతూంది.

నన్ను చూడగానే యిద్దరూ లేచి నిలబడ్డారు.

అజాద్ బైటకు వచ్చాడు.

అందరూ ఆలయంవైపు నడిచాం.

8

రాత్రి పదిగంటలయింది.

గణాచారి తన గుడిసెలోకి వెళ్ళిపోయాడు.

వీరడ్ని పిలిచాను.

"ఇక్కడ యికముందు జరుగబోయే విషయాలేవీ సులేఖాన్‌కు చెప్పకూడదు. అసలు, ఎవరితోనూ చెప్పవద్దు అందుకు ప్రతిఫలంగా అయిదువేలు యిస్తాను" అన్నాను.

నా మాటలధోరణికి తెల్లబోయి, నెమ్మదిగా తలాడించాడు వీరడు.

అజాద్‌ను పిలిచి కెమేరా యిచ్చి, అందులో ఫిల్మ్‌ను డెవలప్ చేసి, ప్రింట్స్ తియ్యమన్నాను.

ఆచార్యను పిలిచి చేయవలసింది చెప్పాను.

నాప్లానులో అత్యంత ముఖ్యమైన ఘట్టం యిది. అందరికి పనులు పురమాయించిన తరువాత, వేపచెట్టు క్రిందకు వచ్చి, వైర్‌లెస్ స్విచ్ ఆన్ చేసి ప్రోగ్రెస్‌నంతా మాలవ్యాకు చెప్పాను.

నా ప్రోగ్రెస్‌ను ఎంకరేజ్ చేస్తూ మెచ్చుకున్నాడు ప్రొఫెసర్.

ఇంతవరకూ ప్రతీది, ప్లాను ప్రకారం పకడ్బందీగా జరిగింది. ఆపరేషన్ క్లయిమాక్స్‌కు వచ్చింది.

విస్కీ సీసామూతతీసి సగం ఖాళీచేశాను. భవిష్యత్తు వూహిస్తూ కళ్ళుమూసుకున్నాను.

9

గణాచారి దగ్గరకు మేంవచ్చి అప్పుడే మూడురోజు లయింది. రోజూ దేవిని పూజిస్తున్నాం.

దేవిపట్ల మాకున్నభక్తిని ఎంతో మెచ్చుకున్నాడు గణాచారి.

కొన్ని మంత్రాలను నాకు నేర్పాడు. ఇష్టం లేక పోయినా నేర్చుకోక తప్పింది కాదు.

ఆచారికి నేను చెప్పిన పని పూర్తి కావచ్చింది.

ఆచారి విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నాడు. అతని పక్కనే ప్లాస్టరాఫ్ పారీస్ పౌడరు, రంగుల ముద్దలున్నాయి.

ఆశ్చర్యం!

చాముండేశ్వరిదేవి విగ్రహానికు, ఆచారి చేసిన విగ్రహానికి ఏమాత్రం తేడాలేదు.

ఆలయంలోని విగ్రహానికి ఈ విగ్రహం నకలు అని ఎవరూ అనుకోలేరు. రెండూ ఒకేలాగవున్నాయి.

ఆచార్య నైపుణ్యానికి జోహార్లర్పించాను.

"వెల్ డన్ అనుకున్న దానికన్నా బాగుంది" ప్రశంసాపూర్వకంగా అన్నాను.

ఆ దినం అమావాస్య. గణాచారి చెప్పిన దానినిబట్టి ఆ రోజంతా దేవిని వుపాసిస్తాడు. రాత్రికూడా దేవీపూజ చేస్తాడు.

నాతోపాటు మిగతావాళ్ళుకూడా వచ్చారు.

గణాచారితోపాటు మేంకూడా స్నానం చేసి, దేవి ముందుకూర్చున్నాం.

నా ప్లానులో చివరిభాగాన్ని అమలుపరచడానికి ఈ దినం చాలా అనుకూలం.

పగలంతా ప్రార్థనతోనే గడిపాం. గణాచారి కూతురు కూడా వచ్చి మాతోపాటు కూర్చుంది.

మంత్రాలతో ఆలయాన్ని దద్దరిల్ల చేస్తున్నాడు గణాచారి.

మేం ఓపిగ్గా కూర్చున్నాం.

ఎంత శ్రమపడ్డా ఈ ఒక్క రోజే.

రాత్రి కావస్తుంది. అందరం గణాచారి దగ్గర సెలవు తీసుకుని గుడిసెకు వచ్చేశాం.

ఆ రాత్రంతా దేవిని మంత్రాలతో గణాచారి కొలుస్తా డట. అతని భక్తికి నాకు ఆశ్చర్యం కలిగింది.

మా భోజనాలు ముగిసాయి.

ఇంతవరకూ మామీద గణాచారికి ఎటువంటి అనుమానం కలగకుండా జాగ్రత్తపడ్డాం.

ఆచార్య, వీరడితో బాతాఖాని కొడుతున్నాడు. అజాద్‌ని దగ్గరకు పిలిచాను.

రాత్రి పన్నెండు అయింది. వెన్నెలకాలం కావడం వలన బయటంతా పిండారబోసినట్లుగా వెలుతురుంది.

నేను, అజాద్ బైటకువచ్చాం. గణాచారి యింటివైపు పరిశీలనగా చూసి ఆలయంవైపు నడిచాం.

అజాద్ చేతిలో నకిలీ చాముండేశ్వరిదేవి విగ్రహం వుంది.

ఆలయంలో గణాచారి కళ్ళుమూసుకుని కూర్చున్నాడు పూనకం వచ్చినవాడిలా వూగుతున్నాడు. అతని పెదాలు నెమ్మదిగా కదులుతున్నాయి. మంత్రాలు చదువు తున్నాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ గర్భగుడిలోకి నడిచాను. జేబులోనుండి 'స్ప్రేగన్' తీశాను. అందులో మత్తుమందు వుంది. ముక్కుకి జేబురుమాలు అడ్డంపెట్టుకుని మెల్లగా మందును గణాచారివైపు "స్ప్రే" చేశాను.

కొద్దిక్షణాలకే గణాచారి నేలకొరిగిపోయాడు. అజాద్ లోపలకు వచ్చాడు.

చాముండేశ్వరిదేవి విగ్రహాన్ని చూశాను. విగ్రహానికి బదులుగా అక్కడ నిలువెత్తు కందరూపాయల నోట్లకట్టలు వున్నట్లుగా ఫీలయ్యాను.

ఆ విగ్రహాన్ని జాగ్రత్తగాతీసి, అజాద్‌కు యిచ్చి అతడి చేతిలోని నకిలీ విగ్రహాన్ని తీసుకుని అసలు విగ్రహం స్థానంలోవుంచాను.

'మిరకల్'గా నా ప్లాను సక్సెస్ అవుతుంది.

స్పృహ కోల్పోయిన గణాచారిని సానుభూతిగా చూశాను. ఒకవేళ అతనికి తెలివివచ్చినా, భక్తిపార వశ్యంలో పడిపోయాననుకుంటాడు.

"వెర్రి పూజారి!" మనసులోనే అనుకున్నాను.

ఇద్దరం ఆలయంనుండి బైటపడి, గుడిసెవైపు నడిచాం.

10

"ఆపరేషన్ గ్రాండ్ సక్సెస్" మర్నాడు వుద యానే వైర్‌లెస్‌లో ప్రొఫెసర్ మాలవ్యాకు చెప్పాను.

కంగ్రాచ్యులేషన్స్ చెప్పి, వెంటనే వచ్చేయ మన్నాడు.

సామాన్లు సర్దుకున్నాం.

గణాచారికి చెప్పి, అతని ఆశీర్వాదాలను తీసుకున్నాం. అతనికి మామీద యింతా ఎటువంటి అనుమానం కలగ లేదు.

గణాచారి కూతురు అజాద్‌వైపు చూసి చేతులూపుతూ మాకు టా, టా చెప్పింది.

నాయకుడి గూడెంకు వెళ్ళి, అతనికి చెప్పి వెళ్ళిపోవ డమే మా కార్యక్రమం. గూడెం చేరుకున్నాం.

గూడెం నాయకుడికి కృతజ్ఞతలు చెప్పి సెలవిప్పించ మన్నాం.

సులేఖాన్‌ను తాను అడిగినట్లు చెప్పమన్నాడు నాయకుడు. సులేఖాన్‌కు యివ్వమంటూ చందనం కర్రతో చేసిన చేతికర్రను యిచ్చాడు.

మా సామానులను తీసుకుని బయలుదేరబోయాం.

ఇంతలో "ఆగండి" అంటూ నాయకుడు అరిచాడు.

తన పక్కనున్న అనుచరుడికి సైగ చేశాడు.

"గూడెంకు వచ్చిన వాళ్ళవస్తువులను వాళ్ళు వెళ్ళేటప్పుడు సోదా చెయ్యడం మా నియమం" చెప్పాడు నాయకుడు.

అతని అనుచరుడు మా సామానులవైపు రాసాగేడు.

నా ప్రాణాలు పైపైనేపోయాయి.

అజాద్, వీరడు ఒకరి ముఖాలొకరు చూచుకొంటున్నారు. ఆచార్య తెల్లముఖం వేశాడు.

"ఆటవికులు ఎంత సాత్వికులో, అంత క్రూరులు" ప్రొఫెసర్ మాలవ్యా మాటలు గుర్తుకు వచ్చి, చెమటలు పట్టాయి.

ఆ సామానులు చూస్తే ఏమన్నా ఉందా? ఆ సూట్ కేసులో చాముండేశ్వరిదేవి విగ్రహం వుంది! అది ఆటవికుల ఆరాధ్య దైవం.

మాకు నిలువునా చావు తప్పదు. లాస్ట్ స్టేజ్‌లో ఈ అవాంతరమేమిటూ అని భయపడ్డాను.

అప్రయత్నంగా నా చేతులు జేబులోని రెండు పిస్టల్స్‌ను పట్టుకున్నాయి.

అందరి దృష్టి సామాన్ల మీద కేంద్రీకరించబడి వుంది. నాయకుడి అనుచరుడు సామాన్లను విడదీసి చూస్తున్నాడు.

సూట్ కేస్ మీద చెయ్యి వేశాడు.

ఉత్కంఠత హెచ్చింది నాకు.

ప్రాణాలు బిగపట్టుకుని చూస్తున్నాను.

సూట్ కేసు తెరిచాడు.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను.

అంతా యింద్రజాలంగా తోచింది. సూట్ కేసులో విగ్రహం లేదు. అడవిలో దొరికే జంతువుల కొమ్ములు, చర్మాలు వున్నాయి. నోటమ్మట మాట రాలేదు నాకు.

ఈ ఆపరేషను యింత ఘోరంగా ఫెయిల్యూర్ అవుతుందని కలలోకూడా వూహించలేదు.

“క్షేమంగా వెళ్ళండి” అన్నాడు నాయకుడు.

ఉసూరుమంటూ ముందుకు సాగేం. కొంతదూరం వెళ్ళేవరకూ ఎవరూ మాట్లాడలేదు. అందరి ముఖాలూ పాలిపోయి వున్నాయి. సూట్ కేస్‌లో వుంచిన విగ్రహం యెలా మాయమయింది? అందరిని కలవరపరుస్తున్న ప్రశ్న యిది.

తీవ్రంగా ఆలోచిస్తున్నాను.

“విచిత్రంగా వుంది” అన్నాడు అజాద్.

సూట్ కేసులో మేమంతా చూస్తుండగా విగ్రహం వుంచింది అజాదే.

అవునన్నట్లుగా తలాడించాను. ఇన్నాళ్ళ మా శ్రమ, నా ప్లాను విఫలమయిందన్న బాధ అందరి ముఖాల్లోనూ తాండవిస్తూంది. నిస్తేజంగా నడుస్తున్నాము.

11

అసలు, ఆ విగ్రహం ఎలా మాయమయిందా, అని ఆలోచిస్తూ నడుస్తున్నాను నేను.

వీరడు ముందు దారి తీస్తున్నాడు. రెండు మైళ్ళదూరం వెళ్ళేసరికి మా వెనకనుండి "అజా!" అన్న పిలుపు వినిపించింది. అందరం ఒక్కసారి వెనుతిరిగి చూశాం.

చెమటలు కక్కుకుంటూ పరిగెత్తుకుని వచ్చింది గణాచారి కూతురు.

ఆమె చేతిలో ఏదో వస్తువు గుడ్డ చుట్టబడి వుంది.

మా అందరి దృష్టి ఆమెమీద కేంద్రీకరించబడింది.

"అజా! నీ గురించే వస్తున్నాను" అంది అజాద్‌ను చూసి.

"చేతిలో మూట ఏమిటి?" ఆత్రుతగా ప్రశ్నించాను.

"ఇదా? మా విగ్రహం. సూట్‌కేసులోనుండి తీసి, దాచాను" అంది.

"ఎందుకు తీశావ్?" ప్రశ్నించాడు అజాద్.

"మీ చర్యలు మొదటినుండి పసిగడుతున్నాను. మా విగ్రహం మీరు దొంగలించి, సూట్‌కేసులో వుంచటం కూడా చూశాను. మీకు యిక్కడ ఆచారాలు తెలియవు. కొత్తవాళ్ళు వచ్చి వెళ్ళినప్పుడు వాళ్ళ వస్తువులు సోదా చేస్తారు. అప్పుడు ఈ విగ్రహం బైటపడితే మిమ్మల్నందర్ని నిలువునా చంపేస్తారు. అందుకని, విగ్రహాన్ని దాచేసి, తెచ్చాను" చెప్పింది. ఆయాసంవలన రొప్పుతోంది.

అందరూ విచిత్రంగా గణాచారి కూతుర్ని చూశారు.

"ఇదంతా ఎందుకోసం చేశావ్?" అనుమానంగా అడిగాను. ఏదో స్వార్థం లేకపోతే యింత సాహసం ఎవరూ చెయ్యరు.

"నీకోసం!" అంది అజాద్ వైపు చూసి.

నాకు పరిస్థితి అర్థమయింది. అజాద్‌ను గణాచారి కూతురు గాఢంగా ప్రేమిస్తుంది.

అందుకు సందేహం లేదు.

అంతవరకూ వెలవెలబోయిన మా అందరి ముఖాలు కళకళలాడాయి. విగ్రహాన్ని పదిలంగా సూట్‌కేసులో పదిలపరిచాం. ఉత్సాహంతో ముందుకు నడిచాం.

సాయంకాలం ప్రొఫెసర్ మాలవ్యాతో వైర్‌లెస్‌లో మాట్లాడేను. జరిగిన తతంగమంతా చెప్పాను. గణాచారి కూతురు మా వెంట వస్తున్నట్లుగా చెప్పాను.

శత్రువుల మనిషామె. ఎప్పటికయినా ప్రమాదం. అడవిలోనే అంతం చెయ్యమని సూచించాడు మాలవ్యా.

మేం వచ్చేసరికి అంతా సిద్ధం చెయ్యమన్నాను. పార్టీలను రెడీగా వుంచమని చెప్పాను.

అలాగే నన్నాడు మాలవ్యా.

వైర్‌లెస్‌లో నేను మాట్లాడడం ముగించేసరికి బాగా చీకటి పడింది.

అజాద్‌ను పక్కకు పిలిచి విషయమంతా చెప్పాను. మౌనంగా విని తలాడించి, గణాచారి కూతుర్ని తీసుకుని మాకు దూరంగా వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాలు గడిచాయి.

పిస్టల్ ప్రేలిన శబ్దం వినిపించింది. ఆ శబ్దం తరువాత వెంటనే స్త్రీ ఆర్తనాదం!

వీరడు, ఆచార్య, పిస్టల్ శబ్దానికి, స్త్రీ ఆర్తనాదానికి కొయ్యబారిపోయారు.

12

ఫియట్ కారు శరవేగంతో ఢిల్లీనగరంలోకి ప్రవేశించింది.

లజ్ కార్నర్ దగ్గర కారును ఆపి, ఆచార్యను దించేశాం. అతనికి యిస్తామన్న ముప్ఫయి అయిదు వేలూ యిచ్చేశాను. మాకు కృతజ్ఞతలు తెలుపుకుని వెళ్ళి పోయాడు ఆచార్య.

కారును ప్రొఫెసర్ మాలవ్యా బంగళాకు పోనివ్వమని అజాద్‌కు చెప్పాను.

ఇరవై నిముషాల్లో మాలవ్యా బంగళాముందు మా ఫియట్ ఆగింది. ఇద్దరం కారు దిగేం.

ప్రొఫెసర్ మాలవ్యా మమ్మల్ని చూస్తూనే ఆనందంతో వుక్కిరిబిక్కిరవుతూ నన్ను కౌగలించుకున్నాడు.

"మార్వలెస్ అడ్వంచర్" అంటూ ప్రశంసించాడు. మాలవ్యా పెర్సనల్ రూంలోకి వెళ్ళాం.

అప్పటికే ఆ రూంలో ఒక విదేశీయుడు కూర్చుని వున్నాడు. అతని ముందు విస్కీ సీసా, గ్లాసులు వున్నాయి.

ఆ విదేశీయుడి తొడమీద అర్ధనగ్నంగా కూర్చుని విస్కీ గ్లాసును అతడి పెదవులకు అందిస్తూంది మాలవ్యా సెక్రటరి మిస్ లేన్యా. మమ్మల్ని చూడగానే చివాల్న అతడి ఒడిలోనుండి లేచి బైటకు వెళ్ళిపోయింది.

నేను భుజాలెగరవేశాను.

"మీట్ మై ఫ్రండ్ మిస్టర్ ఆర్థర్" అంటూ విదేశీయుడ్ని మాకు పరిచయం గావించాడు మాలవ్యా.

పరిచయాలు పూర్తి అయ్యాయి. అజాద్ సూట్ కేసును తీసుకువచ్చి, అందులోనుండి విగ్రహాన్ని తీసి, టేబులుమీద వుంచాడు.

"మార్వలెస్. సింప్లీ ఫేబ్యులస్ బ్యూటీ" అచ్చెరువొందుతూ అన్నాడు ఆర్థర్.

అతడే విగ్రహాన్ని కొనే వ్యక్తి అని అర్థమయింది.

మాలవ్యా తన పిల్లిగడ్డాన్ని గర్వంతో సవరించుకుంటూ నా భుజం తట్టాడు.

"మిస్టర్ ఆర్థర్! అగ్రిమెంటు కుదిరాక, ఎన్ని కష్టాలు ఎదురయినా దానిని మేం సక్రమంగా నిర్వర్తిస్తాం" అన్నాడు ఆంగ్లంలో.

"యస్ ... వెల్ డన్" అంటూ బ్రీఫ్ కేసు తీసి మాలవ్యాకు యిచ్చాడు ఆర్థర్.

దాన్ని తెరిచాడు మాలవ్యా. వంద రూపాయల నోట్ల కట్టలు.

అంతే!

భళ్ళున మాలవ్యా పెర్సనల్ రూం తలుపులు తెరుచుకున్నాయి. అందరం ఉలికిపడి అటు చూశాం.

ఎదురుగా ఇన్ స్పెక్టర్, పోలీసులు!

"ప్లీజ్ ...డోంట్ మూవ్. అందర్నీ అరెస్టు గావించండి" హెచ్చరిస్తూ అన్నాడు ఇన్ స్పెక్టర్.

తెల్లబోయాను. నా కాళ్ళక్రింద భూమి కంపిస్తున్నట్లయింది. "ఎందుకు అరెస్టు చేస్తున్నారు?" గొంతు పెగుల్చుకుని అడిగాను.

నావైపు నిరసనగా చూశాడు ఇన్ స్పెక్టర్.

"ఈ ఆర్థర్ కార్యకలపాలను సీక్రెట్ బ్రాంచి మొదటి నుండి అనుమానిస్తూ, ఫాలో అవుతుంది. ఆర్థర్ని ఈ ప్రొఫెసర్ హోటల్ సెవన్ స్టార్స్లో కల్సుకుని చాలా

సేపు మాట్లాడేడు. పురాతత్వ పరిశోధన శాఖలో పనిచేసే మాలవ్యాకు, ఆర్డర్ తో ఏం పని చెప్పా అని అనుమానించి, మాలవ్యామీద సీక్రెట్ బ్రాంచి తన మనుష్యులను నిఘాకు పంపించింది.

ఈ ఆర్డర్ రెండుమూడుసార్లు మాలవ్యా బంగళాకు వచ్చాడు. మాలవ్యా బంగళాలో పనిచేసే పనిమనిషిని సీక్రెట్ బ్రాంచివాళ్లు ట్రాప్ చేశారు. ఫలితంగా ప్రొఫెసర్ బంగళాలో చాలాచోట్ల పవర్ ఫుల్ ఆటోమేటిక్ మినియేచర్ టేప్ రికార్డ్సును వుంచారు. వాటివలన మీ రహస్యాలన్నీ తెలిశాయి.

మీ అందరి రాకకోసం ఎదురుచూస్తూ వలపన్ని కూర్చున్నాం. డైరెక్టుగా అందరూ వచ్చి, మా అంచనాల మేరకు చిక్కుకున్నారు'' చెప్పాడు ఇన్ స్పెక్టర్.

కోపంగా, ప్రొఫెసర్ వైపు చూశాను.

నా చూపులకు తట్టుకోలేక తల దించుకున్నాడు.

—: ఐపోయింది :—